సాక్షి నల్లగొండ

సోమవారం । 3 । మార్చి । 2025



నంబర్ ప్లేట్లు మారుస్తూ..
కారు నంబర్ ప్లేట్లను మారుస్తూ గంజాయి తరలిస్తున్న ముఠాను చౌటుప్పల్ పోలీసులు పట్టుకున్నారు. - 8లో



రాష్ట్రాల పట్ల కేంద్రం వివక్ష
బీజేపీయేతర రాష్ట్రాల పట్ల కేంద్రం వివక్ష చూపిస్తోందని, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. - 8లో

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6-28 (సోమవారం సా॥)
సహర్ 5-10 (మంగళవారం ఉ॥)

● రంజాన్ మాసం ప్రారంభం




రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా తొలిరోజు ఆదివారం నల్లగొండలోని మదీనా మసీదులో నమాజ్ చేస్తున్న ముస్లింలు, నల్లగొండలో హలీమ్ తింటున్న ప్రజలు

కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్ట భద్రత

● ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ : వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 530 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. కౌంటింగ్ కేంద్రం పరిసరాల్లో 163 బీఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు, ఏజెంట్లు లెక్కింపునకు హాజరు అయ్యే అధికారులు సెల్‌ఫోన్లు, నిషేధిత వస్తువులను లెక్కింపు కేంద్రాల్లోకి తీసుకురావొద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు.



భేరీ మోగిస్తూ దేవతలను ఆహ్వానించే వేడుక నిర్వహిస్తున్న అర్చకులు

న్యూస్‌రీల్

నేటి ప్రజావాణి రద్దు

నల్లగొండ : వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా ఈ నెల 3న సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు ఈ విషయాన్ని గమనించి.. ఫిర్యాదులు సమర్పించేందుకు జిల్లా కేంద్రానికి రావద్దని ఆమె పేర్కొన్నారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న కొర్ర శంకర్‌నాయక్

హాలియా : తెలంగాణ రాష్ట్రంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి గిరిజన సంఘం పోరాడుతుదని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్ర శంకర్‌నాయక్ అన్నారు. ఆదివారం హాలియాలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగం గిరిజనులకు కల్పించిన ప్రత్యేక హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం టీఆర్‌జీఎస్ సాగర్ నియోజకవర్గ, మండల స్థాయి నూతన కమిటీలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు రమావత్ నరేష్ నాయక్, జవహర్ నాయక్, నేనావత్ అశోక్ నాయక్, కొర్ర రాజునాయక్ తదితరులు ఉన్నారు.

జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపిక



గోల్డ్ మెడల్ సాధించిన చామల లక్ష్మీఅభయారెడ్డి

మోటకొండూర్ : మండల కేంద్రానికి చెందిన చామల భానుచందర్‌రెడ్డి – అర్చన దంపతుల కూతురు చామల లక్ష్మీఅభయారెడ్డి జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైంది. ఆదివారం హైదరాబాద్ కొల్లూరు లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో అండర్-10 విభాగంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో లక్ష్మీఅభయారెడ్డి ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం కైవసం చేసుకుంది. ఈనెల 22వ తేదీన విజయవాడలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో తెలంగాణ రాష్ట్రం తరుపున పాల్గొననుంది. లక్ష్మీఅభయారెడ్డికి రాష్ట్ర ఆర్చరీ అసోసియేషన్ ఛైర్మన్ టి.రాజు, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ కొల్లూర్ బ్రాంచ్ ఛైర్మన్ ఎండీ పవన్‌కళ్యాణ్, మాస్టర్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రటరీ రామారావు చేతుల మీదుగా బంగారు పతకం అందజేశారు. లక్ష్మీ అభయారెడ్డికి, కోచ్ వరికుప్పల ప్రమంతికి పలువురు అభినందనలు తెలియజేశారు.

అందాల పోటీలను వ్యతిరేకించాలి

భానుపురి (సూర్యాపేట): తమ వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరింపజేసుకోవడానికి కార్పొరేట్ శక్తులు, ప్రభుత్వాలు కలిసి హైదరాబాద్ వేదికగా నిర్వహించ తలపెట్టిన ప్రపంచ అందాల పోటీలను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు అనసూయ అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లాకేంద్రంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటిన స్త్రీ, పురుషుల మధ్య సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం లేకపోవడం దారుణమన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో మూఢ విశ్వాసాలు, పితృస్వామిక భావజాలం బలపడుతుందని తెలిపారు. ఈ సభలో పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు రాజేశ్వరి, ప్రధాన కార్యదర్శి నరసమ్మ, సహాయ కార్యదర్శి రామలింగమ్మ, సుజాత, జయలక్ష్మి, జయసుధ, లింగమ్మ, సంతోష, ఉపేంద్ర, నాగలక్ష్మి, నవ్య, మహేశ్వరి, శృతి, పావని ఉన్నారు.

ఫలితం తేలేది నేడే..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపునకు అంతా సిద్ధం

- చెల్లిన ఓట్లలో సగానికంటే ఒక్క ఓటు ఎక్కువ వచ్చినా.. వారే విజేత
- మధ్యాహ్నం వరకు పూర్తి కానున్న మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు..
- మొదటి ప్రాధాన్యత ఓట్లతో ఎవరూ గెలువకపోతే ఎలిమినేషన్..
- రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు



కౌంటింగ్ హాల్‌లో ఏర్పాటు చేసిన టేబుళ్లు



కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థుల భవితవ్యం సోమవారం తేలనుంది. ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆధ్వర్యంలో ఇప్పటికే కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ పూర్తయింది. రిహార్సల్స్ కూడా నిర్వహించారు. సోమవారం ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రారంభం కానుంది. మధ్యాహ్నం వరకు మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తికానుంది. మొత్తం చెల్లిన ఓట్లలో సగం కంటే ఒక్క ఓటు ఎక్కువ వచ్చిన అభ్యర్థిని విజేతగా ప్రకటించనున్నారు.

25 టేబుళ్లపై లెక్కింపు..

3వ తేదీ ఉదయం 7 గంటలకు అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లను ఓపెన్ చేసి బ్యాలెట్ బాక్స్‌లను కౌంటింగ్ హాల్‌కు తీసుకురానున్నారు. 7 గంటల నుంచి 8 గంటల వరకు.. 25 బ్యాలెట్లను ఒక బండిల్ చొప్పున కట్టలు కట్టి డ్రమ్ముల్లో వేస్తారు. 8 గంటలు తర్వాత కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభించనున్నారు. ఓట్ల లెక్కింపు కూడా 25 టేబుళ్లపై నిర్వహిస్తున్నారు. ఒక్కో టేబుల్‌కు వేయి బ్యాలెట్ పేపర్ల చొప్పున లెక్కించనున్నారు. దీంతో మొదటి రౌండ్‌లోనే మొత్తం పోలైన ఓట్ల కౌంటింగ్ ప్రక్రియ పూర్తి కానుంది.

పోలైన ఓట్లు 24,139

నియోజవర్గం పరిధిలో మొత్తం 25,797 ఓట్లు ఉండగా.. అందులో 24,139 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 93.57 శాతం పోలింగ్ నమోదైంది. చెల్లిన ఓట్లలో సగం ఓట్ల కంటే ఒక్క ఓటు అధికంగా వచ్చిన అభ్యర్థిని విజేతగా ప్రకటించనున్నారు.

మొదటి ప్రాధాన్యతలో ఫలితం తేలకపోతే ఎలిమినేషన్..

అభ్యర్థులు ఎవరూ మొదటి ప్రాధాన్యత ఓట్లలో విజయం సాధించలేకపోతే.. అప్పుడు ఎన్నికల అధికారులు ఏ అభ్యర్థికి ఎన్ని ఓట్లు వచ్చాయో ప్రకటించి రెండో ప్రాధాన్యత ఓట్లు లెక్కించనున్నారు. పోటీ చేసిన 19 మంది అభ్యర్థుల్లో ఎవరికైతే అతి తక్కువగా ఓట్లు వస్తాయో ఆ అభ్యర్థిని ఎలిమినేషన్ చేసి ఆయనకు వచ్చిన మొదటి ప్రాధాన్యత ఓట్లలో రెండో ప్రాధాన్యత ఓటు ఎవరికి వేసారో చూసి ఆ అభ్యర్థులకు కలుపుతారు. అలా రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతుంది. చెల్లిన ఓట్లలో సగానికి మించి ఒక ఓటును ఎవరు సాధిస్తారో.. అప్పటి వరకు రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. రెండో ప్రాధాన్యత ఓట్లు లెక్కిస్తే మాత్రం చివరి ఫలితం అర్ధరాత్రి వరకు వెల్లడయ్యే అవకాశం ఉంది.

సిబ్బంది కేటాయింపు..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు 25 టేబుళ్లపై నిర్వహిస్తారు. ఒక్కో టేబుల్‌కు ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్, ఒక మైక్రో అబ్జర్వర్, ఇద్దరు కౌంటింగ్ అసిస్టెంట్లు ఉంటారు. మొత్తం 150 మంది టేబుళ్లపై కౌంటింగ్ కోసం ఉండగా, 20 శాతం రిజర్వు సిబ్బంది ఉంటారు. మరో 200 మంది కౌంటింగ్ సమయంలో సహకరించనున్నారు. 530 మంది పోలీస్ సిబ్బంది కౌంటింగ్ బందోబస్తులో పాల్గొననున్నారు.

దేవతలకు ఆహ్వానం

● రెండో రోజూ వైభవంగా నృసింహుడి బ్రహ్మోత్సవాలు



ధ్వజస్తంభం వద్ద గరుత్మంతుడి చిత్రపటానికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు రెండో రోజు ఆదివారం ఆగమశాస్త్రం ప్రకారం వైభవంగా నిర్వహించారు.లోకకల్యాణం, విశ్వశాంతి కోసం ముక్కోటి దేవతలు ఆహుతులుగా సాగే బ్రహ్మోత్సవానికి యాదగిరి క్షేత్రం సిద్ధమైంది. ఆదివారం ఉదయం అగ్నిదేవుడికి ఆరాధన, హవనం, గరుడ ఆళ్వారుడికి ఇష్ట నైవేద్యం, ధ్వజపూజ, రాత్రి దేవతాహ్వాన వేడుకలు నిర్వహించారు.

ధ్వజపటం ఊరేగింపు

ప్రధానాలయంలో ఆదివారం ఉదయం నిత్యారాధనలు పూర్తయిన అనంతరం ఉత్తరమాడ వీధిలో ఏర్పాటు చేసిన యాగశాలలో యాజ్ఞికులు హోమాది పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక వస్త్రంపై తీర్చిదిద్దిన గరుడ ఆళ్వారుడి పటాన్ని ప్రత్యేక పల్లకిపై ఊరేగింపుగా ఉత్తర ద్వారం నుంచి ప్రధానాలయ ముఖమండపంలోని ధ్వజస్తంభం వద్దకు తీసుకువచ్చారు. అనంతరం ఉత్సవ మూర్తులకు ధ్వజస్తంభం వద్ద గరుడ ఆళ్వారుడి పటానికి ప్రత్యేక పూజలు చేశారు. రామానుజ కూటము నుంచి భాజాభజంత్రీలు, మేళ తాళాలతో గరుడ ముద్దలు తీసుకుచ్చి మొదటగా స్వయంభూలు, ఉత్సవమూర్తుల వద్ద, ఆ తరువాత గరుత్మంతుడి వద్ద పూజలు చేశారు. అనంతరం ధ్వజపటానికి హారతినిచ్చి, గరుడ ముద్దలను ధ్వజ స్తంభంపైకి ఎగురవేశారు.

భేరీ మోగించి..

సాయంత్రం భేరీపూజ, దేవతాహ్వానం, హవన పూజ నిర్వహించారు. భేరీ మోగించి ముప్పై మూడు కోట్ల దేవతలను భువికి ఆహ్వానించే వేడుక వైభవంగా చేపట్టారు.



కూచిపూడి నృత్యం చేస్తున్న యువతి

ఆలయంలో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారి అలంకార సేవలు ప్రారంభం కానున్నాయి. ఉదయం 9 గంటలకు అలంకార సేవలకు ఆచార్యులు శ్రీకారం చుట్టనున్నారు. ఉదయం మత్స్య అలంకరా, వేద పారాయణం, రాత్రి 7 గంటలకు శేష వాహన సేవ నిర్వహిస్తారు.

‘వజ్రతేజ’లో బియ్యం నాణ్యత పరిశీలన

హాలియా : అనుముల మండలం పాలెం గ్రామ సమీపంలోని వజ్రతేజ రైస్ క్లస్టర్ ప్రైవేట్ లిమిటెడ్ లో ఆదివారం ఫిలిప్పిన్స్ దేశ అధికారులతో కలిసి కలెక్టర్ ఇలా త్రిపాఠి బియ్యం నాణ్యతను పరిశీలించారు. ఫిలిప్పిన్స్ దేశానికి బియ్యాన్ని ఎగుమతి చేయడానికి ఆ దేశ ప్రభుత్వంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. బియ్యం పరిశీలించిన వారిలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ హరీష్, వజ్రతేజ రైస్ క్లస్టర్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ చిట్టిపోలు యాదగిరి, హాలియా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పేలపూడి బాలకృష్ణ, వజ్రతేజ రైస్ డైరెక్టర్స్ చిట్టిపోలు వెంకటేశ్వర్లు, కుక్కడపు రమేష్, చిట్టిపోలు రంజిత్, కొత్త సుదర్శన్, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ మేనేజర్ చిత్తనూరి పవన్ కుమార్, అనుముల మండల ఇంచార్జ్ తహసిల్దార్ రఘు, పెద్దవూర డిప్యూటీ తహసిల్దార్ ఎండీ ముక్తార్ తదితరులు ఉన్నారు.



వజ్రతేజ రైస్ మిల్లులో బియ్యం పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

తాగునీటి ఎద్దడి తలెత్తొద్దు

చండూరు : వేసవికాలంలో గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆమె చండూరు మున్సిపాలిటీలో, గ్రామాల్లో నీటి ఎద్దడిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీతో పాటు గ్రామ పంచాయతీల్లో జనాభా ఆధారంగా నిధులు వినియోగించాలని సూచించారు. గ్రామాల్లో ఎక్కడా మంచినీటి సమస్య తలెత్తినా వెంటనే పరిష్కరించేందుకు సిబ్బంది చొరవ చూపాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్, చండూరు ఆర్డీఓ శ్రీదేవి, మున్సిపల్ కమిషనర్ మునవర్ అలీ, డీఈ మనోహర, ఏఈ పూజిత తదితరులు పాల్గొన్నారు.

● తెలంగాణ జట్టుకు ప్రథమ బహుమతి



సౌత్‌జోన్ షూటింగ్ బాల్ పోటీల్లో సబ్ జూనియర్ బాలికల విభాగంలో ప్రథమ బహుమతి అందుకున్న తెలంగాణ జట్టు

ఘాటు తగ్గిన మిర్చి..!

- రోజురోజుకూ తగ్గుతున్న ధర
- వేధిస్తున్న కూలీల కొరత
- పెట్టుబడి కూడా రాదని రైతులు ఆవేదన
- కౌలు రైతుల పరిస్థితి మరీ దారుణం



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు కత్తి కనకాల్‌రెడ్డి. ఈ రైతు ఎకరాకు రూ.18వేల చొప్పున 24 ఎకరాలను కౌలుకు తీసుకుని మిరప సాగు చేశాడు. డ్రిప్, సాగునీటి కోసం అదనంగా ఎకరారే మరో రూ.10 వేల చొప్పున ఖర్చయ్యింది. పంట పెట్టుబడి ఎకరాకు రూ.1.5 లక్షలు అయ్యింది. ప్రస్తుతం మిరప కాయలను ఏరిస్తున్నాడు. కాయలు ఏరడానికి కూలీలు, ఆటో కిరాయి, మేస్త్రీ మామూలు వంటి వాటికి క్వింటాకు రూ.5 వేలు ఖర్చవుతుంది. ఎకరాకు 20 క్వింటాళ్ల దిగుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. ప్రస్తుతం ఆర్మూర్ రకం క్వింటా రూ.9 నుంచి రూ.10వేలు పలుకుతోంది. దీనిలో ట్రేడర్ల కమీషన్, రవాణా ఖర్చులు, బస్తాలు, హమాలీలకు మొత్తం కలిపి క్వింటాకు మరో రూ.1500 ఖర్చవుతుంది. దీంతో అతనికి క్వింటాకు మిగిలేది రూ.3500 నుంచి రూ.4500 మాత్రమే. దీంతో పెట్టిన పెట్టుబడి దేవుడు ఎరుగు, కనీసం కౌలు కూడా వచ్చే పరిస్థితి లేదని ఆవేదన చెందుతున్నాడు. ఇదీ జిల్లాలో మిరప సాగు చేసిన రైతుల పరిస్థితి.



పెద్దవూర మండలం బట్టుగూడెంలో తాలు కాయలు ఏరుతున్న కూలీలు

పెద్దవూర : రెండేళ్లుగా మిర్చి రైతుకు గడ్డు పరిస్థితి నెలకొంది. తెగుళ్లతో దిగుబడి తగ్గడం, ధరలు పడిపోవడం, కూలీల కొరత వెరసి రైతును కష్టాల్లోకి నెట్టివేస్తున్నాయి. రెండు సంవత్సరాల క్రితం మిర్చికి రూ.20 వేల నుంచి రూ.28 వేల వరకు అధిక రేటు పలకడంతో రైతులు మిర్చిసాగుకు మొగ్గు చూపారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా సుమారు 12 వేల ఎకరాల్లో పంట వేశారు. వీటిలో ఆర్మూర్, తేజా, దమ్ము వంటి రకాలను సాగు చేశారు. ప్రస్తుతం గ్రామాల్లో ఆర్మూర్ రకానికి క్వింటా రూ.9 వేలు, తేజా రకానికి రూ.13 వేలు, దమ్ము రకానికి రూ.11 వేలకు కల్లాల వద్దే కొనుగోలు చేస్తున్నారు. హైదరాబాద్, గుంటూరు మార్కెట్లలో కాయల రకం, నాణ్యతను బట్టి రూ.10 వేల నుంచి రూ.14 వేల వరకు ధర పలుకుతుంది. అక్కడి తీసుకెళ్లేందుకు రవాణా ఖర్చు, క్వింటాకు 4 శాతం కమీషన్ ఉండటంతో రైతుకు రూ.9 నుంచి రూ.11 వేలు కూడా రావటం లేదు. దీనికి తోడు కూలీ కొరత కూడా వేధిస్తుండడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

వేధిస్తున్న కూలీల కొరత..

ప్రస్తుతం రైతులంతా ఒకేసారి మిర్చి ఏరుతుండటంతో కూలీల కొరత ఏర్పడింది. దీంతో కూలీలకు అధిక కూలి చెల్లించి ఇతర ప్రాంతాల నుంచి తరలిస్తున్నారు. రోజుకు ఒక్కో కూలీకి రూ.350 నుంచి రూ.400 ఇస్తున్నారు. వాహనాల కోసం రోజుకు రూ.800 నుంచి రూ.1000 చెల్లించాల్సి వస్తోంది. దీనికి తోడు మేస్త్రీకి కమీషన్ చెల్లించాలి. దీంతో క్వింటా మిర్చి ఏరేందుకు కూలీలు, రవాణా ఖర్చులు కలిపి రూ.5 వేలు అవుతోంది. పండించిన పంటలో సగానికి పైగా కూలీలకే పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మిర్చికి మద్దతు ధర పెంచాలని రైతులు కోరుతున్నారు. లేదంటే అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకోడమే శరణ్యమని వాపోతున్నారు.

పెరిగిన పెట్టుబడి.. తగ్గిన దిగుబడి

మిర్చి సాగుకు ఈ సారి పెట్టుబడి పెరిగింది. మిరప నాటే సమయంలో ఎండలు అధికంగా ఉండడంతో.. రెండు, మూడు సార్లు నారు వేయాల్సివచ్చింది. చీడపీడలు, తెగుళ్లు ఉధృతంగా వ్యాపించడం, పంట ఎదుగుదలకు కాంప్లెక్స్ ఎరువులు, పురుగు మందులు, మొక్కలు నాటడం, కలుపు తీయించటం వంటి వాటికి ఎకరాకు రూ.1.5 లక్షల పెట్టుబడి వచ్చినట్లు రైతులు చెబుతున్నారు. ఈ సారి దిగుబడి ఆశాజనకంగా లేదు. 8 నుంచి 10 క్వింటాళ్లు కూడా పండే పరిస్థితి లేదు. దీనికి తోడు పావువంతు తాలుకాయలు అవుతున్నాయి. సకాలంలో వర్షాలు పడకపోవడం, వాతావరణం మార్పులతో తేమ అధికంగా వుండటంతో పంట దిగుబడి తగ్గినట్లు వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.



మిరప కాయలను ఏరుతున్న కూలీలు

కూలీలకే సగడం డబ్బు పోతోంది



మేము పండించిన పంటలో సగం డబ్బు కూలీలకే సరిపోతుంది. దీనికితోడు తెగుళ్ల బెడదతో పంటలో పావువంతు తాలుకాయలు అవుతున్నాయి. మద్దతు ధర లేకపోవడంతో మిరప కాయలను హైదరాబాద్‌లో ఏసీలో పెట్టాను. ధర వచ్చాక అమ్ముకుంటా. ఈ ధరకు అమ్మితే అప్పులపాలే.

– కూన్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, రైతు, బట్టుగూడెం

మార్కెట్ సదుపాయం కల్పించాలి

సాగర్, దేవరకొండ నియోజవర్గాల పరిధిలో మిరపకు మార్కెట్ సదుపాయం కల్పించాలి. ఇక్కడ మార్కెట్ లేకపోవడంతో హైదరాబాద్, గుంటూరు వెళ్లి అమ్ముకోవాల్సి వస్తోంది. అక్కడ తెలిసిన వాళ్లు ఎవరూ లేకపోవడంతో బ్రోకర్లను ఆశ్రయిస్తున్నాం. మార్కెట్‌కు నాలుగు శాతం కమీషన్ ఇవ్వడంతో పాటు, బ్రోకర్‌కు కొంత డబ్బు ఇవ్వాల్సి వస్తోంది. రవాణా ఖర్చుతో పాటు కాయలు అమ్ముడుపోక రెండు, మూడు రోజులు అక్కడే ఉండాల్సి వస్తుండటంతో ఖర్చులు పెరిగిపోతున్నాయి.

– కర్నాటి మల్లారెడ్డి, రైతు, పెద్దవూర

క్లుప్తంగా

ఎంజీయూలో స్టాఫ్ క్వార్టర్స్ ప్రారంభం



స్టాఫ్ క్వార్టర్స్‌ను ప్రారంభిస్తున్న వైస్ చాన్స్‌లర్ అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ టూటౌన్ : మహాత్మాగాంధీ యూనివర్సిటీలో స్టాఫ్ కోసం నిర్మించిన క్వార్టర్స్‌ను వైస్ చాన్స్‌లర్ అల్తాఫ్ హుస్సేన్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంజీయూ సైతం ఐఐటీ తరహాలో రూపుదాల్చడానికి ఇదొక ముందడుగని అన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ అలువాల రవి, ఆకుల రవి, డా. శ్రీదేవి, కొప్పుల అంజిరెడ్డి, వై. ప్రశాంతి, ఉపేందర్‌రెడ్డి, మద్దిలేటి, ఇంజనీర్ శైలజ, అధ్యాపకులు పాల్గొన్నారు.

నల్లబెల్లం, పటిక పట్టివేత

మద్దిరాల: బొలేరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లం, పటికను ఆదివారం మద్దిరాల మండల కేంద్రంలో పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ వీరన్న తెలిపిన వివరాల ప్రకారం.. మద్దిరాల మండలం మామిండ్లమడవ గ్రామానికి చెందిన షేక్ ఖాదర్, షేక్ మదారు అన్నదమ్ములు. వీరిద్దరు కలిసి 30క్వింటాళ్ల నల్లబెల్లం, 10 కిలోల పటికను బొలేరో వాహనంలో రాజు అనే డ్రైవర్ సహాయంతో ఏపీలోని చిత్తూరు నుంచి మామిండ్లమడవ గ్రామానికి తరలిస్తుండగా మద్దిరాల మండల కేంద్రంలో పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన నల్లబెల్లం, పటికతో పాటు బొలేరో వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

అడ్డగూడూరు : అడ్డగూడూరు మండలం కంచనపల్లి గ్రామ శివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతిచెందింది. ఈ ఘటన ఆదివారం జరిగింది. స్థానికుల సమాచారం మేరకు ఎస్‌ఐ నాగరాజు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి వయస్సు సుమారు 45 ఏళ్లు ఉంటుందని, ఆమె భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. మృతురాలు మహారాష్ట్రకు చెందిన టీషర్ట్ ధరించి ఉందని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామన్నపేట ఏరియా ఆస్పత్రి తరలించినట్లు పేర్కొన్నారు. ప్రమాదానికి కారమైన గుర్తుతెలియని వాహనం కోసం సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కుక్కల దాడి.. గొర్రెలు మృతి

తుంగతుర్తి: కుక్కల దాడి చేయడంతో పది గొర్రెలు మృతిచెందాయి. తుంగతుర్తి మండలం మంచతండాకు చెందిన లాకవత్ లాల్‌సింగ్ తన గొర్రెలను రోజుమాదిరిగానే శనివారం సాయంత్రం తన ఇంటి ఎదుట గల దొడ్డిలోకి గొర్రెలను తోలాడు. రాత్రి వేళ దొడ్డిలోకి కుక్కలు చొరబడి గొర్రెలపై దాడి చేయడంతో 10 గొర్రెలు మృతిచెందాయి. గొర్రెల విలువ రూ.లక్ష వరకు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

ప్రైవేట్ బస్సులో ప్రసవం

చిట్యాల: చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారులో ఆదివారం తెల్లవారుజామున కారును లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు మృతిచెందారు. మృతుల కారు ట్రావెల్స్ బస్సును కిందకు వెళ్లగా.. ఆ బస్సు దాని ముందున్న కారును, ఆ కారు మరో ట్రావెల్స్ బస్సును ఒకదానికొకటి ఢీకొన్నాయి. ప్రమాదానికి గురైన ప్రైవేట్ బస్సులో హైదరాబాద్ నుంచి ఏపీకి గర్భిణి శశికళ తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రయాణిస్తోంది. ట్రాఫిక్ జాంలో చిక్కుకున్న బస్సు కొద్దిసేపటి తర్వాత చిట్యాలకు చేరుకుంది. అదే సమయంలో శశికళకు పురిటి నొప్పులు రావటంతో తోటి ప్రయాణికులు అంబులెన్స్‌కు ఫోన్ చేసినప్పటికీ రాలేదు. చిట్యాలలో ట్రాఫిక్ విధుల్లో ఉన్న కానిస్టేబుళ్లు జలంధర్, శివ బస్సు వద్దకు చేరుకుని శశికళకు ధైర్యం చెబుతుండగా.. ఆమె బస్సులోనే ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం అక్కడకు అంబులెన్స్ చేరుకోగా.. వైద్య సిబ్బంది పరీక్షించి నల్లగొండలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నేటి నుంచి అలంకార, వాహన సేవలు

- తొలిసారి బంగారు తాపడం చేసిన వాహనాలపై ఊరేగనున్న యాదగిరీశుడు



బంగారు తాపడం చేసిన శేష వాహనం



బంగారు తాపడం చేసిన గరుడ వాహనం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం నుంచి అలంకార సేవలు, వాహన సేవలకు అర్చకులు శ్రీకారం చుట్టనున్నారు. 7 రోజుల పాటు ఒక్కో అలంకారంలో ఒక్కో సేవపై స్వామివారు ఊరేగనున్నారు. సోమవారం ఉదయం మత్స్యావతార అలంకార సేవ, రాత్రి శేష వాహన సేవ, 4వ తేదీ ఉదయం వటపత్రశాయి అలంకార సేవ, రాత్రి హంస వాహన సేవ, 5వ తేదీ ఉదయం శ్రీకృష్ణాలంకార(మురళీకృష్ణుడు) సేవ, రాత్రి పొన్న వాహన సేవ, 6వ తేదీ ఉదయం గోవర్ధనగిరిధారి అలంకార సేవ, రాత్రి సింహ వాహన సేవ, 7వ తేదీ ఉదయం జగన్మోహిని అలంకార సేవ, రాత్రి అశ్వవాహన సేవలో స్వామివారి ఎదుర్కోలు ఉత్సవం, 8వ తేదీ ఉదయం హనుమంత వాహనంపై శ్రీరామ అలంకార సేవ, రాత్రి గజవాహన సేవలో తిరుకల్యాణ మహోత్సవం, 9వ తేదీ ఉదయం గరుడ వాహనంపై శ్రీమహావిష్ణు అలంకార సేవతో అలంకార సేవలు ముగియనున్నాయి. అదే రోజు రాత్రి దివ్య విమాన రథోత్సవం ఉంటుంది.

చివరి రెండు రోజులు ఇలా..

10వ తేదీన ఉదయం మహా పూర్ణాహుతి, విష్ణు పుష్కరిణిలో చక్రతీర్థం, సాయంత్రం శ్రీపుష్పయాగం, దేవతోద్వాసన, దోపు ఉత్సవాలను జరిపిస్తారు. 11వ తేదీ ఉదయం 10గంటలకు అష్టోత్తర శతఘటాభిషేకం, రాత్రి శృంగార డోలోత్సవం నిర్వహించి ఉత్సవాలను ముగిస్తారు.

బంగారు తాపడం చేసిన వాహనాలపై..

యాదగిరీశుడు తొలిసారిగా స్వర్ణ తాపడం చేసిన వాహన సేవలపై ఆలయ తిరు, మాడ వీధుల్లో ఊరేగనున్నారు. హైదరాబాద్‌కు చెందిన సాయి పావని కన్‌స్ట్రక్షన్స్ ఇండియా లిమిటెడ్, గార్లపాటి పెద్ద యాదయ్య, రామలింగేశ్వరి కుటుంబ సభ్యులు రూ.12లక్షలతో గరుడ, శేష వాహనాలకు బంగారు తాపడం చేయించారు. అంతేకాకుండా రూ.4లక్షలతో అనురాధ టింబర్ డిపో నిర్వాహకులు నూతనంగా బర్మా టేకుతో సేవ పీటలను తీర్చిదిద్దారు. వీటి పైనే స్వర్ణ తాపడం చేసిన శేష, గరుడ వాహనంపై స్వామి వారు ఊరేగుతారు.

కోదాడ ప్రభుత్వాస్పత్రి సిబ్బందిపై కలెక్టర్ ఆగ్రహం

- షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆదేశం..?

కోదాడ: కోదాడ పట్టణ సమీపంలోని ఖానాపురానికి చెందిన ఓ వ్యక్తి పురిటినొప్పులతో బాధపడుతున్న తన భార్యను ఫిబ్రవరి 26 తెల్లవారుజామున కోదాడ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా అక్కడి వైద్యులు పట్టించుకోలేదని అతడు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశాడు. ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో లేరని, నర్సులు తన భార్యను పరీక్షించి కండీషన్ సీరియస్‌గా ఉందని సూర్యాపేటకు తీసుకెళ్లమని చెప్పారని, అంబులెన్స్ ఉన్నా కూడా ఏర్పాటు చేయలేదని వీడియోలో ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ వీడియో సూర్యాపేట కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ దృష్టికి వెళ్లడంతో ఆయన కోదాడ ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని శనివారం జిల్లా వైద్యాధికారిని ఆదేశించినట్లు తెలిసింది. ఇదే విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ దశరథనాయక్‌ను వివరణ కోరగా.. కోదాడ ఆస్పత్రిలో ముగ్గురు గైనకాలజిస్టులు ఉండాల్సి ఉండగా.. ప్రస్తుతం ఒక్కరే పనిచేస్తున్నారని, ఫిబ్రవరి 26న సదరు గర్భిణి ఆస్పత్రికి వచ్చిన సమయంలో ఆ వైద్యురాలు సెలవులో ఉండడంతో సిబ్బంది పరిశీలించి ఉమ్మ నీరు ఎక్కువగా ఉండడంతో సూర్యాపేటకు తీసుకెళ్లాలని సూచించారని పేర్కొన్నారు. సిబ్బంది, వైద్యుల కొరత లేకుండా చూడాలని ఉన్నతాధికారులకు నివేదిక పంపామని పేర్కొన్నారు.

వేసవిలో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు

- విద్యుత్ శాఖ సూర్యాపేట జిల్లా ప్రత్యేకాధికారి, చీఫ్ ఇంజనీర్ కామేష్



అనుములగూడెం సబ్ స్టేషన్‌లో రైతులతో మాట్లాడుతున్న చీఫ్ ఇంజనీర్ కామేష్

హుజూర్‌నగర్: వేసవిలో విద్యుత్ అంతరాయం లేకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ సూర్యాపేట జిల్లా ప్రత్యేకాధికారి, చీఫ్ ఇంజనీర్ ఏ. కామేష్ అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్ పరిధిలోని అనుములగూడెం సబ్ స్టేషన్, మద్దుమనగర్‌లోని సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన పరిశీలించి విద్యుత్ వినియోగదారులతో మాట్లాడారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ.. హుజూర్‌నగర్ డివిజన్‌లోని ఆయా గ్రామాల్లో ఉన్న వినియోగదారులతో ఒక వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేయించాలన్నారు. 24 గంటల్లో ఎప్పుడైనా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగితే ఆ వాట్సాప్ గ్రూప్ ద్వారా తెలియజేస్తే ఆ సమస్యను పరిష్కరించడానికి ఆస్కారం ఉంటుందన్నారు. అనంతరం మఠంపల్లి మండలంలోని బక్కమంతులగూడెంలో కొత్తగా నిర్మిస్తున్న సబ్ స్టేషన్‌లో కొత్త బ్రేకర్‌తో కస్తూర్బా స్కూల్ ఫీడర్‌ని చార్జ్ చేసి రఘునాథపాలెం ఫీడర్ మీద ఉన్న అధిక లోడును మళ్లించారు. దీంతో బక్కమంతులగూడెం, పరిసర గ్రామాల ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరాకు అవకాశం కలిగింది. కార్యక్రమంలో విద్యుత్ డీఈ ఎస్. వెంకటకిష్టయ్య, ఏడీఈలు సక్రు నాయక్, నాగిరెడ్డి, ఏఈలు రాంప్రసాద్, హరీష్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కారు నంబర్ ప్లేట్లు మారుస్తూ..



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రాజేష్‌చంద్ర



చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్‌కు రివార్డు అందజేస్తున్న డీసీపీ రాజేష్‌చంద్ర

- గంజాయి తరలిస్తున్న నిందితుడి అరెస్ట్
- రిమాండ్‌కు తరలింపు
- వివరాలు వెల్లడించిన భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర

చౌటుప్పల్, చౌటుప్పల్ రూరల్ : కారు నంబర్ ప్లేట్లు మారుస్తూ గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు వివరాలను ఆదివారం చౌటుప్పల్ ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర వెల్లడించారు. మహారాష్ట్రలోని బీడ్ జిల్లా కేంద్రంలోని రామ్‌నగర్ కాలనీలో నివాసముంటున్న నకుల్ కైలాష్ గైక్వాడ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఫిబ్రవరి 28న నకుల్ కైలాష్ గైక్వాడ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనకాపల్లి జిల్లా నర్సీపట్నం సమీపంలోని కన్నూరుపాలెం గ్రామానికి వెళ్లాడు. అక్కడ వీరబాబు అనే వ్యక్తి వద్ద 102కిలోల గంజాయి కొనుగోలు చేశాడు. దానిని రెండు కిలోల చొప్పున 51 ప్యాకెట్లుగా మార్చి తన వెంట తీసుకెళ్లిన కారులో వేసుకుని మహారాష్ట్రకు బయల్దేరాడు. పోలీసులకు పట్టుబడకుండా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రకు చెందిన నంబర్ ప్లేట్లను తయారు చేయించి ఏ రాష్ట్రం గుండా వెళ్తే ఆ నంబర్ ప్లేట్ కారుకు అమర్చేవాడు.

పక్కా సమాచారం మేరకు పట్టివేత..

నకుల్ కైలాష్ గైక్వాడ్ కారులో గంజాయి తరలిస్తున్న విషయాన్ని ఓ వ్యక్తి పోలీసులకు తెలియజేశాడు. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఎక్కడికక్కడ తనిఖీలు చేపట్టారు. శనివారం చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టగా.. ముందు నంబర్ ప్లేటు లేకుండా వస్తున్న నకుల్ కైలాష్ గైక్వాడ్ కారును ఆపి తనిఖీలు చేయగా అందులో గంజాయిని గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని 102 కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు, రూ.2వేల నగదు, వివిధ రాష్ట్రాలకు చెందిన కారు నంబర్ ప్లేట్లు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ తెలిపారు. ఈ కేసులో ముంబైకి చెందిన సేటు అనే వ్యక్తి, నర్సీపట్నం పరిధిలోని కన్నూరుపాలెంకు చెందిన వీరబాబును అరెస్ట్ చేయాల్సి ఉందని తెలిపారు. ఈ కేసును ఛేదించిన పోలీసులు, సిబ్బందికి డీసీపీ రివార్డులు అందజేశారు. ఈ విలేకరుల సమావేశంలో చౌటుప్పల్ ఏసీపీ పటోళ్ల మధుసూదన్‌రెడ్డి, సీఐ మన్మథకుమార్, ఎస్‌ఐలు భాస్కర్‌రెడ్డి, యాదగిరి, సిబ్బంది సత్యనారాయణ, సందీప్, భరద్వాజ్, పాపయ్య తదితరులు ఉన్నారు.

స్కూటీని ఢీకొట్టిన లారీ.. ఒకరు మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు



గాయపడిన మృతుడి స్నేహితుడు

చివ్వెంల(సూర్యాపేట): అతివేగంగా వెళ్తున్న లారీ అదుపుతప్పి స్కూటీని ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై చివ్వెంల మండలం దురాజ్‌పల్లి గ్రామ స్టేజీ వద్ద ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మోతె మండలం నర్సింహులగూడెం గ్రామానికి చెందిన జూలకంటి అనిల్‌రెడ్డి(45) కుటుంబం కొద్ది సంవత్సరాల క్రితం సూర్యాపేటకు వలస వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. అనిల్‌రెడ్డి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం చివ్వెంల మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన తన మామ ముప్పాని తిరుమల్‌రెడ్డి దురాజ్‌పల్లి గ్రామ శివారులోని పెద్దగట్టు వద్ద పండుగ చేస్తుండగా అనిల్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం తిమ్మాపురం గ్రామానికి వచ్చాడు. ఈ క్రమంలో హైదరాబాద్‌కు చెందిన తన స్నేహితుడుని తీసుకొచ్చేందుకు స్కూటీపై సూర్యాపేటకు వెళ్లి, అతడిని ఎక్కించుకుని తిమ్మాపురం వస్తుండగా మార్గమధ్యలో దురాజ్‌పల్లి గ్రామ స్టేజీ వద్ద కుక్క అడ్డురావడంతో కిందపడిపోయారు. అదే సమయంలో హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్తున్న లారీ అనిల్‌రెడ్డి పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అతని స్నేహితుడు వినయ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం సూర్యాపేట ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ మహేశ్వర్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌కు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

బునాదిగాని కాలువను ఎందుకు పూర్తి చేయట్లేదు

- రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ



మాట్లాడుతున్న పశ్య పద్మ

భువనగిరిటౌన్: సంవత్సరాలు గడిచినా, పాలకులు మారినా బునాదిగాని కాలువను ఎందుకు పూర్తిచేయడం లేదని రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ ప్రశ్నించారు. రైతు సంఘం భువనగిరి మండల ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం భువనగిరి జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో బబ్బూరి అంజమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో పశ్య పద్మ పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో మూసీ నీళ్లతో రైతులు లక్షలాది ఎకరాలు సాగు చేసుకుంటున్నారు. భువనగిరి జిల్లా పరిధిలో కూడా బునాదిగాని కాలువ పూర్తికావాలని తెలంగాణ రైతు సంఘంతో పాటు కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహించామన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై కూడా ఒత్తిడి తీసుకొచ్చినప్పటికీ పూర్తి చేయలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ ప్రక్షాళన మీద హడావిడి చేస్తుంది తప్ప పనులు ప్రారంభించడం లేదని ఆరోపించారు. బునాది గాని కాలువను వెడల్పు చేసి మూసీ నీరు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భువనగిరి, వలిగొండ, ఆత్మకూరు, మోత్కూరు, అడ్డగూడూరు, తిరుమలగిరి వరకు కాలువ ఉపయోగంలోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. బునాది గాని కాలువ ద్వారా సరిపడా నీళ్లు వస్తాయని భావించి రైతులు పంటలు వేశారు కానీ నీళ్లు రాక వరి పంటలు ఎండిపోతున్నాయని అన్నారు. బునాది గాని కాలువను పూర్తి చేయుటకు నిధులు మంజూరు చేసి తక్షణమే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్, పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, నాయకులు చింతల పెంటయ్య, చొప్పరి సత్తయ్య, ఏనుగు మల్లారెడ్డి, పుల్లూరు పద్మ, ఏదునూరు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీయేతర రాష్ట్రాల పట్ల కేంద్రం వివక్ష

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ



మాట్లాడుతున్న జాన్ వెస్లీ

భూదాన్‌పోచంపల్లి: బీజేపీయేతర రాష్ట్రాల పట్ల బడ్జెట్ కేటాయింపుల్లో కేంద్రం వివక్ష చూపిస్తోందని, ఇది సమాఖ్య వ్యవస్థకు విరుద్ధమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పేర్కొన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం పిలాయిపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న జిల్లా నాయకత్వస్థాయి శిక్షణ తరగతులకు ఆదివారం ఆయన హాజరై మాట్లాడారు. కేంద్ర బడ్జెట్ పూర్తిగా కార్పొరేట్‌సంస్థలకు మేలు చేసేవిధంగా ఉందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో రూ.47వేల కోట్లు విలువచేసే వాటాను ప్రైవేట్, కార్పొరేట్ శక్తులకు విక్రయించాలని కేంద్రం నిర్ణయించడం దారుణమని అన్నారు. బీమారంగంలో వందశాతం ఎఫ్‌డీఐ లను అనుమతిస్తూ దేశీయ బీమా సంస్థలను ప్రమాదంలో పడేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. మూసీ ప్రక్షాళనకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు లేవని, ఇకదళితులు, గిరిజనులకు బడ్జెట్‌ను పెంచాల్సింది పోయి తగ్గించడం దారుణమని అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలకు అధిక నిధులు కేటాయిస్తూ తెలంగాణకు మాత్రం మొండిచేయి చూపిందని విమర్శించారు. బడ్జెట్ కేటాయింపుల్లో వివక్ష చూపుతున్నా.. తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు కేంద్ర మంత్రులు నోరు మెదపడంలేదని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌పై కాంగ్రెస్ పార్టీ మెతకవైఖరి సరికాదన్నారు. సీపీఎం కేంద్రకమిటీ సభ్యుడు బి. వెంకట్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్, రాష్ట్రకమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, భట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, జెల్లెల పెంటయ్య, కృష్ణారెడ్డి, శ్రీనివాసచారి, గూడూరు అంజిరెడ్డి, గడ్డం వెంకటేశం పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు



మొదటి బహుమతి గెలుపొందిన చిత్తూరు జిల్లా జట్టుతో కోదాడ ఎమ్మెల్యే పద్మావతి

మేళ్లచెరువు: మహాశివరాత్రి సందర్భంగా మేళ్లచెరువు మండల కేంద్రంలోని శివాలయం వద్ద నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. మొదటి బహుమతి ఏపీలోని చిత్తూరు జిల్లా జట్టు, రెండో బహుమతి విజయనగరం జిల్లా జట్టు, మూడో బహుమతి కృష్ణా జిల్లా జట్టు, నాల్గో బహుమతి తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా జట్లు గెలుచుకున్నాయి. విజేతలకు కోదాడ ఎమ్మెల్యే పద్మావతి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐరారియాల్టీ చైర్మన్ పోశం నర్సిరెడ్డి, వీరారెడ్డి, మాజీ ఎంపీపీ పద్మాసైదేశ్వర రావు, మాజీ జెడ్పీటీసీ పద్మాగోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని దివ్యాంగుల నిరసన



మునుగోడు ప్రధాన కూడలిలో నిరసన వ్యక్తం చేస్తున్న దివ్యాంగులు

మునుగోడు : స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం మునుగోడులో వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మోకాళ్లపై నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ నేటికీ అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్, తలారి సహదేవులు, చిన్నపాక మత్స్యగిరి, గుడిపల్లి సుమతి, వంటిపాక ముత్తమ్మ, ఆకారపు వెంకన్న, రేణుక అలివేలు, మంగమ్మ, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

బావులు, బోర్లు వెలవెల.. ఎండుతున్న పంటలు

- నవాబుపేట రిజర్వాయర్ ద్వారా గోదావరి జలాలు అందించాలని కోరుతున్న రైతులు



గుండాలలో ఎండిన వరి పంటను చూపెడుతున్న రైతులు



పాచిల్లలో వాటర్ ట్యాంకర్‌తో నీరు పడుతున్న రైతు

గుండాల : గుండాల మండలానికి గోదావరి జలాలు అందక రైతులు వేసిన వరి పంటలు ఎండిపోతున్నాయి. మండలంలో నవాబుపేట రిజర్వాయర్‌తో 32వేల ఎకరాలకు సాగు నీరు అందించాలని ప్రభుత్వ ప్రతిపాదనలు ఉన్నప్పటికీ అధికారుల అలసత్వం, పాలకుల నిర్లక్ష్యంతో సాగు నీరు రాక పంటలు ఎండిపోతున్నాయి. సాగు నీరు వస్తుందన్న ఆశతో రైతులు బోర్లు, బావుల కింద 1250 ఎకరాలు వరి సాగు చేశారు. ఎండలకు భూగర్భజలాలు అడుగంటిపోయి బావులు, బోర్లలో నీరు లేక వట్టిపోతున్నాయి. ఇప్పటికే సుమారు 200 ఎకరాలలో వరి ఎండిపోయినట్లు అధికారులు అంచనా వేశారు. దీంతో ఏం చేయాలో తోచక రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో ఉన్న 83 కుంటలు, చెరువులకు గోదావరి జలాలు వస్తే వేసిన పైర్లు పంటలు పండుతాయని ఆశతో ఎదురుచూసిన రైతాంగానికి నిరాశే మిగిలింది. ఇటీవల ప్రభుత్వం గోదావరి జలాలను బిక్కేరు వాగుకు విడుదల చేయడంతో అనంతారం, సుద్దాల, బ్రాహ్మణపల్లి, అంబాల, మోత్కూరు, వంగాల గ్రామాల రైతులకు ఊరట లభించింది. కానీ వెలమ్మజాల, సీతారాంపురం, మరిపడిగ, మాసాన్‌పల్లి, రామారం, గుండాల, నూనెగూడెం, తుర్కలశాపురం, పెద్దపడిశాల, వస్తాకొండూర్, బండకొత్తపల్లి గ్రామాలకు సాగు నీరు అందక రైతులు వేసిన పంటలు ఎండిపోతున్నవి. దీంతో రైతాంగం సాగు నీటి విడుదల కోసం ఎదురుచూస్తున్నారు. మండలంలో బిక్కేరు పరీవాహక ప్రాంతాలలో కళకళలాడుతుంటే మరోపక్క పంటలు ఎండిపోతున్నాయి. దీంతో రైతాంగం పంటలను కాపాడుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా పాలకులు నవాబుపేట రిజర్వాయర్ ద్వారా గోదావరి జలాలను మండలానికి అందించి ఎండిపోతున్న పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

వాటర్ ట్యాంకర్‌తో నీళ్లు పెడుతున్నా..



నాకున్న రెండెకరాలతో పాటు మరో ఐదెకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేశాను. ఎండలతో బావి, బోర్లలో నీరు తగ్గడంతో సుమారుగా 3 ఎకరాల పొలం ఎండుతుంది. దీంతో వాటర్ ట్యాంకర్‌కు నెలకు రూ.15వేలు చెల్లించి వ్యవసాయ బావుల వద్ద నీటిని పట్టి రోజుకు ఒక 30 గుంటల వరి పొలాన్ని తడుపుతున్నాను. ప్రభుత్వం గోదావరి జలాలు విడుదల చేసి చెరువులు, కుంటలు నింపాలి. గ్రామానికి చెందిన బోరు వద్ద వాటర్ ట్యాంకర్‌ను నింపుకునేందుకు వెళ్తే కొంతమంది రైతులు గొడవ చేస్తున్నారు. దీంతో పొలం ఎండిపోతున్నది.

– తూనం నరేష్, రైతు, పాచిల్ల

బహుమతులు ప్రదానం

నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాల మైదానంలో నిర్వహించిన సౌత్‌జోన్ షూటింగ్ బాల్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ఆదివారం షూటింగ్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రటరీ జీతురాజ్ తోమర్ తదితరులు బహుమతులు అందజేశారు.



బహుమతుల ప్రదానోత్సవంలో మాట్లాడుతున్న షూటింగ్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రటరీ జీతురాజ్ తోమర్



సబ్ జూనియర్స్ బాలుర విభాగంలో ప్రథమ బహుమతి అందుకుంటున్న తెలంగాణ జట్టు



జూనియర్ గర్ల్స్ విభాగంలో ద్వితీయ బహుమతి అందుకుంటున్న తెలంగాణ జట్టు